క్లుప్తంగా

ఖబర్‌స్థాన్‌లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి



మంగళగిరి: కార్పొరేషన్ పరిధి యర్రబాలెం ముస్లిం ఖబర్ స్థాన్ (స్మశానవాటిక)లో సుమారు రూ.30 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే స్మశానవాటికలో మట్టితోలి మెరక పనులు పూర్తి చేయడంతో పాటు చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి కాగా తాజాగా అంతర్గత సీసీ రహదారుల నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. సుమారు 100 మీటర్ల పొడవుతో 11 అడుగుల వెడల్పుతో ఒక సీసీ రోడ్డుతో పాటు 10 మీటర్ల పొడవుతో ఏడు అడుగుల వెడల్పుతో నాలుగు సీసీ రోడ్లను నిర్మించారు. మృతుల బంధువులు వజూ చేసుకునేందుకు వీలుగా వజూఖానా, రేకుల షెడ్డు నిర్మాణాలతో పాటు విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు.

సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి: పెంచిన నిత్యావసర వస్తువులు గ్యాస్, పెట్రోల్, డీజిల్, మందులు, బియ్యం, నూనెలు, విద్యుత్ చార్జీల ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అన్నారు. సోమవారం మండలంలోని నీరుకొండలో సమరభేరి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీపీఎం పిలుపు మేరకు నేటి నుంచి సెప్టెంబరు నాలుగవ తేదీ వరకు సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అధిక ధరలకు వ్యతిరేకంగా రాజధాని గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు, తోకల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరులో మెగా వైద్య శిబిరం



మేడికొండూరు: మండల పరిధిలోని లూథరన్ చార్చి సమీపంలో హెల్ప్ ఫౌండేషన్ నెహ్రూ యువ కేంద్రం సంస్థ ఆధ్వర్యంలో కామాక్షి ఐకేర్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఫాదర్ రెవ. దీలీప్ సోమవారం ప్రారంభించారు. ఫాదర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవాసంస్థల సేవలు మరువలేనివన్నారు. వైద్యుడు డాక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా కంటి సమస్యలు అందరిని ఇబ్బంది పెడుతున్నాయని, వైద్యుల సలహాలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే కంటి సంరక్షణ బాగుంటుందన్నారు. అధిక సమయం టీవీ చూస్తుండటం వల్ల కంటి సమస్యలు ఎక్కువయ్యాయన్నారు. ఈ శిబిరంలో సుమారు 180 మందికి కంటి పరీక్షలు చేయడం జరిగిందన్నారు. కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమైన 18 మందిని గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ఫౌండేషన్ సభ్యుడు అంజలి, శ్రీలత, వనిత, సంఘ పెద్దలు శ్యామ్, నాగరాజు, రాజేంద్ర ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మందిర జీర్ణోద్ధరణకు శంకుస్థాపన

గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 23 డివిజన్ కంకరగుంట రైల్వేగేటు ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి మందిర జీర్ణోద్ధరణ పనులకు సోమవారం ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శంకుస్థాపన చేశారు. సీతారామచంద్రస్వామి వారి మందిర జీర్ణోద్ధరణతో పాటు సాయిబాబా మందిర అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు 23వ డివిజన్ కార్పొరేటర్ సాదు ఉమా మహేశ్వరీ రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

'కిట్స్' విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి, ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కళాశాలలో విద్యార్థులకు ట్రాన్స్‌ఫార్మింగ్ సెల్ఫ్ అండ్ రిలేషన్‌షిప్స్‌పై మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథి చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మానశికంగా అభివృద్ధి చెందడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ మానసికంగా ధృడంగా ఉన్న విద్యార్థులు ఉన్నత శిఖరాలను సులువుగా చేరుకొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఐ.నరసింహస్వామి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ జి.మురళి పాల్గొన్నారు.

'ఇప్పటం'.. అభివృద్ధి పథం

- గతంలో రోడ్లు సైతం లేక గ్రామస్తుల ఇక్కట్లు
- నేడు చుట్టుపక్కల గ్రామాల నుంచి 5 నిమిషాల్లో చేరుకునేలా రహదారుల నిర్మాణం
- అందరికీ అందుబాటులో కల్యాణమండపం
- గ్రామంలో అభివృద్ధి పరుగులు
- ఇప్పటివరకు సుమారు రూ.10 కోట్లతో పనులు పూర్తి



ఇప్పటంలో నిర్మిస్తున్న ప్రధాన రహదారి



నూతన కల్యాణ మండపం

తాడేపల్లిరూరల్: మండలంలోని ఇప్పటం గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాజకీయ విమర్శలకు తావులేకుండా మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎంటీఎంసీ అధికారులు అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఇప్పటివరకు ఇప్పటం వ్యాప్తంగా సంక్షేమ పథకాలు కాకుండా సుమారు రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తిచేశారు. గ్రామంలో గతంలో ఎన్నడూ నిర్వహించని కొత్త రోడ్లను సైతం నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో సరైన రోడ్డు లేక ఇతర ప్రాంతాల ప్రజలు ఇప్పటం వెళ్లేందుకు భయపడేవారు. ఇప్పుడు ఇప్పటం వెళ్లాలంటే ఎటునుంచైనా 5 నిమిషాల్లో వెళ్లవచ్చు. ఆ ప్రాంతానికి వచ్చే రహదారులను సైతం మరమ్మతులు చేయించి ఎమ్మెల్యే ఆర్కే సారధ్యంలో బీటీ రోడ్ నిర్మించారు.

- మంగళగిరి రూరల్ పెదవడ్లపూడి నుంచి తాడేపల్లి రూరల్ కొలనుకొండ జాతీయ రహదారి వరకు రూ.75 లక్షలతో బీటీ రోడ్ మరమ్మతులు నిర్వహించి, కొత్తగా మరో బీటీ రోడ్ ఏర్పాటు చేశారు.
- ఇప్పటం–వడ్డేశ్వరం, ఇప్పటం–ఆత్మకూరు, ఇప్పటం–పెదవడ్లపూడిలలో 9 కి.మీ. పొలిమేర డొంకలను రూ.58 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేశారు.
- బకింగ్‌హామ్ కెనాల్ నుంచి ఇప్పటం గంగరాయి చెట్టు వరకు సుమారు 1.3 కి.మీ పొడవున రైతుల కోసం రూ.కోటి వ్యయంతో బీటీ రోడ్ నిర్మాణం పూర్తి చేశారు.
- ఇప్పటం ప్రధాన రహదారి హిందూ స్మశాన వాటిక దగ్గర నుంచి ఇప్పటం సొసైటీ వరకు 550 మీటర్ల పొడవున సుమారు 15 మీటర్ల వెడల్పున మధ్యలో డివైడర్, లైటింగ్‌కు రూ.1.65 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు.
- ఇప్పటంలో ఇప్పటివరకు రూ.1.80 కోట్ల వ్యయంతో పలు రహదారులలో పక్కా సీసీ డ్రైన్ నిర్మాణాలు చేపట్టారు. గతంలో నిర్మించిన సీసీ రోడ్లు కాకుండా రూ.1.14 కోట్లు ఖర్చుచేసి సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.
- ఇప్పటం రోడ్డు నుంచి పంటపొలాల్లోకి వచ్చేందుకు గంగరాజు చెట్టు వద్ద వీరంకి సాంబయ్య ఇంటివద్ద రూ.12 లక్షల వ్యయంతో రెండు కల్వర్టులు నిర్మించారు.
- తాగునీటి కోసం మూడు బోర్లు, విద్యుత్ మోటార్లు, పైపులైన్ల నిమిత్తం రూ.24.50 లక్షలు ఖర్చు చేశారు. గ్రామస్తుల సహకారంతో రూ.6.50 వేలతో పార్కు నిర్మాణం, పోతురాజు గుడి ప్రహరీ గోడ నిర్మించారు. ఇప్పటంలో ఎంపియుపి పాఠశాలలో 14 లక్షల వ్యయంతో నాడు నేడు పనులు నిర్వహించారు.

అందుబాటులోకి కల్యాణ మండపం..

ఇప్పటంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేసేవిషయంలో కొన్ని రాజకీయ పార్టీలు అడ్డుకుని మూడుసార్లు కోర్టును ఆశ్రయించి భంగపడ్డారు. ఎంటీఎంసీ అధికారులు కోర్టులో ప్రభుత్వ ఆస్తి అని రుజువు చేశారు. దాంతో కార్పొరేషన్ నిధుల నుంచి రూ. 1.05 కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక హంగులతో నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చారు. ఈ కళ్యాణ మండపానికి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగా, ఉద్యమ నాయకురాలు చాకలి ఐలమ్మ, సామాజిక కార్యకర్త సర్దార్ గౌతు లచ్చన్నల పేర్లు పెట్టారు. ఈ కళ్యాణ మండపాన్ని రూ.25 వేల కార్పొరేషన్ ఫీజు వసూలు చేస్తూ అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు.

గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు	రూపాయల్లో
బీటీ రోడ్ల నిర్మాణం	2,72,50,000
డ్రైనేజీల నిర్మాణం	1,80,00,000
సీసీ రోడ్ల నిర్మాణం	1,14,00,000
కల్వర్టు నిర్మాణం	12,00,000
తాగునీటి కోసం	24,50,000
గ్రావెల్ రోడ్ నిర్మాణం	58,00,000
గ్రామస్తుల సహకారం	65,00,000
27 ఇళ్ల నిర్మాణం	48,60,000
కల్యాణ మండప నిర్మాణం	1,05,00,000
ఎంపీయూపీ నాడు–నేడు పనులు	14,00,000
మొత్తం	**10,01,60,000**

ఇళ్ల నిర్మాణాలు...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లులేని ప్రతి అక్కా చెల్లెమ్మకు పక్కా ఇల్లు నిర్మించాలనే ఉద్దేశ్యంతో ఇప్పటంలో అర్హులైన వారికి దశల వారీగా 36 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఇప్పటికే అందులో 27 ఇంటి నిర్మాణాల నిమిత్తం సుమారు రూ.4.80కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు సారె సమర్పణ



పసుపు, కుంకుమ, సారెతో పోలేరమ్మ అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న ముత్తయిదువులు

మంగళగిరి: నగరంలోని కొత్త మంగళగిరిలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారికి సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో పసుపు, కుంకుమలతో పాటు సారె సమర్పించారు. తొలుత మహిళలు పెద్ద సంఖ్యలో పసుపు, కుంకుమ, సారెను తీసుకుని మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి నాగారమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి షరాఫ్ బజారు, మెయిన్ బజారు మీదుగా లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం మీదుగా తిరిగి పోలేరమ్మ అమ్మ వారి దేవాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ముత్తయిదువులు నైవేద్యంతో పాటు పసుపు, కుంకుమలతో పాటు సారె సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు చింతక్రింది కనకయ్య, గుత్తికొండ ధనుంజయరావు, దామర్ల కుబేరస్వామి, గంజి రవీంద్రనాథ్, రామనాథం పూర్ణచంద్రరావు, వంగర లక్ష్మయ్య, జొన్నాదుల భిక్షారావు, వెనిగళ్ల హనుమంతరావు, కొల్లివేణు, జంజనం శ్రీనివాసరావు, వెనిగళ్ల భాగ్యలక్ష్మి, జంజనం నందకుమారి, గోలి వెంకట శ్రీదేవి పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య మలేరియా విభాగ కార్మికుడు బండి రాజు కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్ ను సోమవారం కమిషనర్ చాంబర్‌లో బయాలజిస్ట్ మధుసూదన్‌తో కలిసి కమిషనర్ అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ప్రజారోగ్య మలేరియా విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే బండి రాజు ఇటీవల కాలంలో అనారోగ్యం వలన మరణించారని, ఆయన భార్య రమణకు ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షల చెక్ ని అందించామన్నారు. నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను ఆదేశించారు. కార్మికులు కూడా తమ సమస్యల పై ప్రతి గురువారం జరిగే ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అర్జీలు, ఫిర్యాదులు అందిచవచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సత్తా చాటిన జీజీహెచ్ నర్సింగ్ సిబ్బంది



నర్సింగ్ సిబ్బందిని అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: హైదరాబాద్‌లోని బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఈ నెల 25, 26 వ తేదీల్లో జాతీయ అంకాలజీ నర్సింగ్, సింపొజియం జరిగింది. ఈపోటీల్లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్ నర్సింగ్ సిబ్బంది తమ సత్తా చూపారు. సదస్సులో దేశ వ్యాప్తంగా హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు 1200 మంది పాల్గొన్నారు. గుంటూరు నాట్కో క్యాన్సర్ కేంద్రం నుంచి ఏడుగురు హాజరయ్యారు. క్యాన్సర్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ టి.వి. శివరామకృష్ణ ఆధ్వర్యంలో హాజరైన గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందుకున్నారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ను నర్సింగ్ సిబ్బందిక కలిసి తమ విజయగాథను పంచుకున్నారు. పోస్టర్ ప్రెసెంటేషన్‌లో హెడ్ నర్సు దాసరి రోజ్‌రాణి, జి. గౌరీ కల్యాణి, కె. రాజ్యలక్ష్మి బహుమతులు సాధించారు. క్విజ్ పోటీల్లో స్టాఫ్ నర్సులు జి.ఉషారాణి, కె.వెంకట సుబ్బమ్మలకు ప్రథమ బహుమతి లభించింది. డాక్టర్ కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం హెడ్‌నర్సు రోజ్‌రాణి ఆధ్వర్యంలో రూ. 5 వేలు నర్సింగ్ సిబ్బంది అందజేశారు. ఆసుపత్రిలో పనిచేస్తూ వారికి వచ్చిన నగదును తిరిగి ఆసుపత్రి కోసం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ బత్తుల వెంకట సతీష్ కుమార్, పాల్గొన్నారు.

జీవ్ దయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

జీవ్ దయ ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగానికి రూ. 50 వేలు విలువ చేసే వైద్య పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ గైనకాలజీ విభాగాలకు ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సేవ దృక్పథంతో వైద్య పరికరాలు అందించిన జీవ్ దయ ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.జయంతి మాట్లాడుతు గర్భి ణులకు కాన్పుల సమయంలో ఇబ్బందులు పడకుండా, అధిక రక్త స్రావం జరగకుండా నివారించేందుకు అత్యాధునిక వైద్య పరికరాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. సంస్థ అందజేసిన వైద్య పరికరాలను సూపరింటెండెంట్ చేతుల మీదుగా గైనకాలజీ విభాగానికి సరఫరా చేశారు.

దోమల నివారణకు ఫాగింగ్

తాడికొండ: వర్షాకాలం దోమల వృద్ధి పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలలో భాగంగా గ్రామంలో ఫాగింగ్ చేయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం నుంచి ప్రాంతాల వారీగా ఫాగింగ్ యంత్రం సాయంతో మందును పిచికారీ చేయిస్తున్నామన్నారు. కాలువల్లో నీటి నిల్వలను మురుగు నీటి మళ్లింపు ప్రక్రియతో పాటు దోమల మందు పిచికారీ చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్‌వీఆర్‌జేసీలో మేధో సంపత్తి హక్కులపై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: నూతన ఆవిష్కరణలకు పేటెంట్లు పొందే దిశగా విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేయాలని, అందుకు అనుగుణంగా అధ్యాపకులు తగిన శిక్షణను అందించాలని ఆంధ్ర యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ అనింద్యరాయ్‌చౌదరి పేర్కొన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో మేధో సంపత్తి హక్కులపై (పేటెంట్) ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేటెంట్స్, కాపీ రైట్స్, డిజైన్, జాగ్రఫికల్ ఇండికేషన్, ట్రేడ్ మార్క్ , ట్రేడ్ సీక్రెట్, అనే అంశాలను గురించి వివరించారు. నూతన పరికరాలకు, వస్తువులకు పేటెంట్స్ హక్కులు పొందేందుకు జరిగే వివిధ దశలను తెలిపారు. విద్యార్థులు ఎంచుకొనే నూతన వస్తువులు, పరికరాల తయారీ రూపకల్పనలో ఎదుటివారిని ఆకర్షించే తత్వం ఇదివరకు ఎన్నడూ లేనిది, సమాజానికి ఉపయోగపడేది వుండాలని తెలిపారు. మనదేశంలో తయారైన వస్తువులకు పేటెంట్స్ పొందుతూ విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి నేడు భారతదేశం చేరడం గర్వకారణమన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆమెను ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డాక్టర్ కె.శోభ పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు శ్రద్ధాంజలి



తాడేపల్లిరూరల్: 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగిన విద్యుత్ చార్జీల వ్యతిరేక పోరాటంలో ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులకు ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో సోమవారం సీపీఎం, సీపీఐ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. విద్యుత్ చార్జీల వ్యతిరేక పోరాటంలో అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధనరెడ్డి, బాలస్వామిల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, రూరల్ మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు తుడిమెల వెంకటయ్య, మానికొండ డాంగే తదితరులు ఉన్నారు.

తాడేపల్లికి చేరిన జూనియర్ షర్మిల పాదయాత్ర

ఘనస్వాగతం పలికిన ప్రజలు



వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ పాదయాత్ర చేస్తున్న జూనియర్ షర్మిల

తాడేపల్లిరూరల్: మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలంటూ మేడ్చర్ల మేరీ అలియాస్ జూనియర్ షర్మిల చేస్తున్న పాదయాత్ర సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లికి చేరింది. జూనియర్ షర్మిల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను స్థానికులకు వివరించారు. ఆమె రాకను పురస్కరించుకుని తాడేపల్లి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ తనది మైలవరం అని, గతంలో వైఎస్ షర్మిల చేసిన పాదయాత్రలో రాష్ట్రంలో ఆమె వెన్నంటే నడిచినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి కూడా ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో మైలవరం నుంచి ప్రత్తిపాడు వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలంతా ఆయన వెంట ఉన్నారని, 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘనవిజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపడతారని తెలిపారు. జగనన్నకు మేమంతా అండగా ఉన్నామని ప్రజలు మద్దతు పలుకుతుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. 10 నియోజకవర్గాల్లో పాదయాత్ర పూర్తిచేస్తానని తెలిపారు. ఎంతమంది వచ్చినా, ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ప్రమాణస్వీకారం చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన లారీ

టిప్పర్ డ్రైవర్‌కు గాయాలు



గాయాల పాలైన ఇసుక టిప్పర్ డ్రైవర్



లారీ ఢీకొట్టడంతో నుజ్జయిన టిప్పర్ ముందు భాగం

తాడికొండ: ఇసుక టిప్పర్‌ను వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో టిప్పర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన సోమవారం తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. వివరాల ప్రకారం అమరావతి నుంచి ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ లారీని పొన్నెకల్లు వైపు నుంచి వస్తున్న 20 టన్నుల బెంజ్ లారీ అతివేగంగా వచ్చి ముందు భాగాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ముందు భాగాన్ని బలంగా ఢీకొట్టడంతో డ్రైవర్ ఎగిరి రోడ్డుపై పడి గాయాల పాలయ్యాడు. లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు పోయేందుకు యత్నించగా స్థానికులు నిలిపివేసి క్షతగాత్రుడిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ నీరుకొండ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేస్తున్న ఓ ప్రైవేటు కంపెనీకి చెందినదిగా గుర్తించారు. డ్రైవర్ జార్ఖండ్‌కు చెందిన వాడు కాగా ఇతనికి లైసెన్స్ ఉన్నది లేనిది నిర్ధారణ కాలేదు, టిప్పర్ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థికసాయం



ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారికి మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయాన్ని ప్రకటించి సోమవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలువూరు గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందిన కుటుంబాలకు, పలు అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారి వివరాలను ఎమ్మెల్యే ఆర్కేకు తెలుపగా వెంటనే స్పందించిన ఆయన పది మంది బాధితులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించి అందజేశారని, ఈ సందర్భంగా బాధితులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలియజేశారని అన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డివిఆర్), నాయకులు యేసురత్నం, జంషద్ ఖాన్, ఫిలోమిన, ఫిరోజ్, నెమలికంటి బాబూరావు, యామర్తి లాజర్, మధు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో చిరు వ్యాపారులకు వారి వ్యాపారాభివృద్ధి కోసం మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి తోపుడు బండ్లను సోమవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలువూరు గ్రామంలో నివాసముంటున్న సయ్యద్ ఖలీల్, కంచర్ల అంజయ్య, మొగలి కోటేశ్వరరావు, వడ్డేశ్వరపు శివమ్మలు పలు రకాల చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనంసాగిస్తున్నారని, వారి వ్యాపార అభివృద్ధికి, జీవనాధారానికి తోపుడు బండ్లు అవసరమని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన వెంటనే వారికి తన సొంత డబ్బులతో తోపుడు బండ్లను తయారుచేయించి అందజేశారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే డొంకరోడ్లకు మోక్షం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య

మేడికొండూరు: సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వంలో డొంకరోడ్లకు మోక్షం కలిగిందని మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య అన్నారు. మండల కేంద్రమైన మేడికొండూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో మండల పరిధిలోని డోగిపర్రు, మంగళగిరిపాడు గ్రామాల్లో డొంకరోడ్లకు మోక్షం కలిగిందని, రూ.19 లక్షలతో డోగిపర్రు నుంచి విశదల అడ్డ రోడ్డు వరకు డొంకరోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. అదేవిధంగా గత 49 సంవత్సరాల నుంచి కై లాసగిరి కొండ మార్గానికి తారు రోడ్డు మోక్షం కలుగలేదని, జిల్లాపరిషత్ నిధులతో రూ.11 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణం జరుగుతుందని, జిల్లాపరిషత్ చైర్మన్ కత్తెర హెనిక్రిస్టినా ఆధ్వర్యంలో నిర్మించడం జరిగిందన్నారు. మంగళగిరిపాడులోని గ్రామ పంచాయతీ నిధులతో డొంకరోడ్లకు శంకుస్థాపన జరిగి, వాటి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ కత్తెర సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలో పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజలందరూ వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారని, మరోకసారే కాకుండా జీవితాంతం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, పొట్లపాడు సొసైటీ చైర్మన్ పాములపాటి వీరయ్య, రాజేంద్రప్రసాద్, గుంటూరుపల్లి కోటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, వీరయ్య, నాగేశ్వరరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.